ప్రజల మాట ప్రగతి బాట

# మేడ్చల్ నియోజకవర్గం



రాంపల్లిదాయరలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నేత కందాడి శ్రీకాంత్‌రెడ్డి

## మంత్రిపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించం

**కీసర, నవంబర్ 27:** మంత్రి చామకూర మల్లారెడ్డిపై రాంపల్లిదాయర ఉప సర్పంచ్ చేసిన ఆరోపణలను రాంపల్లిదాయర వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా ఖండించారు. రాంపల్లిదాయరలో మంత్రి మల్లారెడ్డి ఎలాంటి అభివృద్ధి చేయలేదని కాంగ్రెస్ నేతలు అనుచిత వాఖ్యలు చేశారు. సోమవారం బీఆర్ఎస్ మండల సీనియర్ నేత కందాడి శ్రీకాంత్‌రెడ్డితో పాటు పలువురు నేతలు మీడియా సమావేశాన్ని నిర్వహించారు. మంత్రి రాంపల్లిదాయరలో సొంత నిధులతో రోడ్లు, మహిళా భవనం, ఇందిరమ్మ కాలనీలో తాగు నీటి పైప్‌లైన్‌లు, ప్రభుత్వ నిధులతో పంచాయతీ భవనం, ఎస్సీ కమ్యూనిటీ హాల్స్‌తో పాటు మరెన్నో చేశారన్నారు. రాంపల్లిదాయరలో మంత్రి చేసిన అభివృద్ధిని చూడకుండా కాంగ్రెస్ నేతలు ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదని కందాడి శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో రాంపల్లిదాయర మాజీ సర్పంచ్ మల్లేశ్, నాయకులు బాలకృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, సాయినాథ్‌గౌడ్, ఆంజనేయులు, దిలీప్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

## అభ్యర్థుల ఖర్చు వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలి

**మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 27:** అభ్యర్థుల ఎన్నికల ఖర్చు వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని భారత ఎన్నికల సంఘం ప్రత్యే వ్యయ పరిశీలకులు బి.ఆర్.బాలకృష్ణణ్ సూచించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఐదు నియోజకవర్గాల్లో చేపట్టిన ఎన్నికల ఏర్పాట్లపై ప్రత్యేక జిల్లా వ్యయపరిశీలకులు ప్రమ్ ప్రకాశ్‌మీనా, బాలా సాహెబ్ బాపూరావు, రాచకొండ అదనపు పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి, డీసీపీలుశబరీష్, జానకి, ఎంసీపీ, ఎంసీఎంసీ, జీఎస్‌టీ, ఇన్‌కంటాక్స్, వాణిజ్య పన్నుల శాఖ, ఎక్సైజ్ శాఖ, ఎల్‌డీఎం, వ్యయ పరిశీలన నోడల్ అధికారి, సహాయ వ్యయ పరిశీలకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలలో ఎన్నికల నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్ల గురించి జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ గౌతమ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర పరిశీలకులకు వివరించారు. అనంతరం భారత ఎన్నికల సంఘం ప్రత్యేక వ్యయ పరిశీలకులు బి.ఆర్.బాలకృష్ణణ్ మాట్లాడుతూ నగదు, మద్యం, బహుమతులపై ప్రత్యేక నిఘా పెట్టాలని, పోటీలో ఉన్న అభ్యర్థుల బ్యాంకు ఖాతాలను పరిశీలించి, అవసరమైన తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## కారులో తరలిస్తున్న మద్యం పట్టివేత

**మేడ్చల్:** ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నవనీత ఆధ్వర్యంలో మేడ్చల్ బస్టాండ్ వద్ద సోమవారం తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో మెదక్ జిల్లా రంగాయపల్లికి చెందిన సుధానం భాను చందర్ కారులో బీరుబాటిళ్లను తూప్రాన్‌కు తరలిస్తున్నట్టు గుర్తించారు. సీజ్ చేసిన మద్యం విలువ రూ.17,550 ఉంటుందని సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్సైలు రాఘవేశ్వర్, యూసుఫ్, చంద్రయయ, కానిస్టేబుళ్లు శ్రీశైలం, శ్రీనివాస్, దినకర్, సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ను నమ్మితే కరువే..

- మూడుచింతలపల్లిలో మంత్రి ప్రచారం
- భారీగా తరలి వచ్చిన ప్రజలు



మూడుచింతలపల్లి మండలంలోని ఎన్నికల ప్రచారం రోడ్ షోలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

**శామీర్‌పేట, నవంబర్ 27:** కాంగ్రెస్ పార్టీని నమ్ముకుంటే కరువు తాండవం చేస్తుందని మంత్రి మల్లారెడ్డి ఎద్దేవా చేశారు. ఎన్నిక ప్రచారంలో భాగంగా సోమవారం మూడుచింతలపల్లి మండలంలోని జగ్గంగూడ, కేశవరం, నాగిశెట్టిపల్లి, మూడుచింతలపల్లి, లక్ష్మాపూర్ గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 60 ఏండ్ల కాంగ్రెస్ పార్టీ పాలనలో ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. కుర్చీల కుమ్ములాటతోనే కాంగ్రెసోళ్లకు సరిపోతుందన్నారు. కాంగ్రె పాలనలో రోడ్లు ఏ విధంగా ఉన్నాచి.. ఇప్పుడు ఏవిధంగా ఉన్నాయో ప్రజలు గమనించాలని కోరారు. రైతాంగానికి పెద్దపీట వేసింది తెలంగాణ ప్రభుత్వం అన్నారు. రైతుబంధు, రైతుబీమా, నిరంతర విద్యుత్ అందించడం జరిగిందన్నారు. ఎన్నికల తర్వాత పోడుభూములు, పోరంబోకు భూములకు పట్టాలు ఇస్తామన్నారు. కేసీఆర్ కిట్టు, ఇంటింటికి నల్లా నీరు, నిరంతర విద్యుత్, సాగునీటి సరఫరా వంటి ఎన్నో పథకాలను ప్రజలకు అందించిన ఘనత తెలంగాణ ప్రభుత్వం, బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రాగానే సౌభాగ్యలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ప్రతి నెల రూ.3 వేలు, సిలిండర్ రూ.400లు వంటి అనే సంక్షేమ పథకాలు అందించనున్నట్లు వివరించారు. మేడ్చల్ నియోజకవర్గ ప్రజలకు స్వంత నిధులతో ఆలయాల నిర్మాణం, కుల సంఘాల భవనాలు, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామనారు. అభివృద్ధికి పట్టగట్టేందుకు ఈ నెల 30న కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఎంపీపీ హారిక, సర్పంచ్‌లు విష్ణువర్ధన్‌రెడ్డి, జ్యోతిబలరాంగౌడ్, కృపాకర్‌రెడ్డి, జాము రవి, సింగం ఆంజనేయులు, హరిమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ నాగరాజు, కో ఆప్షన్ సభ్యుడు గౌస్‌పాషా, బీఆర్ఎస్ అధ్యక్షుడు మల్లేశ్, ప్రధాన కార్యదర్శి అనిల్‌రెడ్డి, గోలి హరిమోహన్‌రెడ్డి, చిత్తాగౌడ్, గ్రామీణ అధ్యక్షుడు నీరజ్‌గౌడ్, రమేశ్, నాగరాజు, సదాశివరెడ్డి, గోపాల్, భూమేష్ గౌడ్, లక్ష్మీనారాయణ, జహంగీర్ పాల్గొన్నారు.



మూడుచింతలపల్లి మండలంలోని భారీగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు

## కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి చేయాలి

**కీసర, నవంబర్ 27:** కీసర మండలం భోగారంలోని హోలీమేరి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన జిల్లా ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ గౌతమ్‌కుమార్ సోమవారం సందర్శించారు. కౌంటింగ్ సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్,అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిని హరిప్రియతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కౌంటింగ్ కేంద్రాలకు విచ్చేసే ఏజెంట్లకు, అధికారులకు వేర్వేరుగా రూట్లను ఏర్పాటు చేయాలని, అవసరమైన బారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల పరిశీలకుల కోసం ప్రత్యేక గదులను ఏర్పాటు చేయాలన్నారు. వేగవంతమైన నెట్ సౌకర్యాన్ని కంప్యూటర్లను, సీటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. కౌటింగ్ హాల్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. మీడియాకు ప్రత్యేక వసతి ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### నేటి సాయంత్రం ప్రచారం ముగించాలి

ఎన్నికల నియామావలి ప్రకారం వివిధ రాజకీయ పార్టీలు తాము చేస్తున్న బహిరంగ సభలు, ఎస్ఎంఎస్, ప్రచారాలను మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ముగించాలని కలెక్టర్ సూచించారు.నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



భోగారంలోని హోలీమేరి ఇంజినీరింగ్ కళాశాలోని కౌంటింగ్ కేంద్రంలో గదులను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ గౌతమ్

# కార్తిక శోభ

- భక్తులతో కీసరగుట్ట సందడి
- భక్తులతో కిటకిటలాడిన పలు ఆలయాలు
- స్వామి సేవలో మంత్రి మల్లారెడ్డి , భక్తులు
- స్వామి వారికి ప్రత్యేక పూజలు, శివలింగాలకు అభిషేకాలు



కీసరగుట్టలో స్వామివారిని దర్శించుకుంటున్న మంత్రి చామకూర మల్లారెడ్డి


**మేడ్చల్ కలెక్టరేట్/కీసర,నవంబర్ 27:** కార్తిక పౌర్ణమి సందర్భంగా పలు ఆలయాలు కార్తిక శోభను సంతరించుకున్నాయి. కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామిని మంత్రి మల్లారెడ్డి సోమవారం స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అంతకుముందు ఆలయ చైర్మన్ రమేశ్‌శర్మ, ఆలయ వేదపండితులు పూర్ణకుంభంతో మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రిని ఆలయ చైర్మన్ రమేశ్‌శర్మ శాలువాతో ఘనంగా సత్కరించి వేదఆశీర్వచనం చేయించారు.భక్తులు భారీగా తరలివిచ్చ కీసరగుట్టపై ఉన్న స్వామివారిని దర్శించుకొని శివలింగాలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.స్వామి వారి దర్శనం కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసి పోయాయి. కీసరగుట్ట పరిసరాలు ఓం శివనామస్మరణతో మారుమోగాయి.అదేవిధంగా చీర్యాల్ శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయానికి భక్తులు భారీ ఎత్తున్న తరలివచ్చారు.ఆలయంలో భక్తులు సత్యనారాయణ వ్రతాల వేడుకలను నిర్వహించారు. అదేవిధంగా నాగారం 17వ వార్డు సత్యనారాయణ కాలనీలోని శ్రీ రమాసత్యనారాయణ స్వామి, శ్రీ షిర్డీ సాయి బాబా, శ్రీ పోచమ్మ ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆయుష్ హోమం, శ్రీ రమా సత్యనారాయణ స్వామి కల్యాణం ఘనం గా జరిగింది. జరిగాయి.



స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో వస్తున్న భక్తజనం



నాగారం17వ వార్డు సత్యనారాయణ కాలనీలో శ్రీ రమా సత్యనారాయణ స్వామి కల్యాణం



చీర్యాల్ శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో భక్తుల శ్రీ సత్యనారాయణ వ్రతాలు



కీసరగుట్టలో శివలింగాలకు అభిషేకం చేస్తున్న భక్తులు